



మాట్లాడుతున్న గోదావరి

మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి

- ప్రగతి శీల మహిళా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు గోదావరి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. ఆదివారం వశిష్ట డిగ్రీ కళాశాలలో మహిళ, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమర్షియల్ మార్కెటింగ్ కోసం అందాల పోటీలను నిర్వహించడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమేనని అన్నారు. బహుళజాతి కంపెనీలకు రాజకీయ నాయకులకు స్త్రీ ఒక అంగడి వస్తువుగా మారిందన్నారు. అందమంటే శ్రమైక జీవన సౌందరమేనని కొలతల ద్వారా అందాన్ని నిర్ణయించడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమేనని అన్నారు. దేశంలో రాచరిక వ్యవస్థ ఏర్పడిన తర్వాత మహిళలను అణిచివేయడం ప్రారంభించారని స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్త్రీ పురుషులకు సమాన హక్కులు కల్పించారని పేర్కొన్నారు. కానీ పెట్టుబడి దారి వ్యవస్థలో మరోసారి మహిళను బానిసగా చూడడం ప్రారంభమైందని తెలిపారు. 72వ మిస్ వరల్డ్ అందాల పోటీలు కాస్మోటిక్ కంపెనీలకు వేలాది కోట్ల లాభాలను చేకూర్చేందుకు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ పోటీల వల్ల మహిళలకు ఎలాంటి ఉపయోగం లేదని తెలంగాణ ప్రభుత్వం అందుకు రూ.250 కోట్లు ఖర్చు చేయడం అర్థరహితమని అన్నారు. తక్షణమే పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పీఓడబ్ల్యు జిల్లా నాయకులు అనిత, హేమలత, సత్యక్క, నాగమణి, శశికళ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



గుండారం అటవీ ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న అధికారులు

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

రాజంపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని గుండారం అటవీ ప్రాంతంలో ఆదివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్‌వో రమేష్ తెలిపారు. అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా తాడ్వాయి మండలం సంతాయిపేట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు ఇసుక ట్రాక్టర్లలో ఇసుక నింపుతుండగా గుర్తించామని తెలిపారు. వెంటనే ట్రాక్టర్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీధర్‌రావు, సెక్షన్ అధికారి బాబా, బీట్ అధికారులు శ్రీను, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్.. ఉన్నా.. లేనట్లే!



మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

- పేరుకే కార్యాలయం.. కానీ అధికారులు, సిబ్బంది ఉండరు
- రైతులకు ఏ అవసరం వచ్చినా నిజామాబాద్‌కు వెళ్లాల్సిందే..
- రైతుల సమస్యలు వినేవారే కరువు
- నిజామాబాద్ నుంచే మార్క్‌ఫెడ్ శాఖ కార్యకలాపాలు
- కామారెడ్డి కలెక్టరేట్‌లో మార్క్‌ఫెడ్ కార్యాలయం దుస్థితి
- మార్క్‌ఫెడ్‌ను పూర్తిస్థాయిలో కామారెడ్డికి తరలించాలని ఎమ్మెల్యేల వినతి
- ఇకనైనా కలెక్టర్ దృష్టి సారించి మార్క్‌ఫెడ్‌ను కామారెడ్డికి మార్చాలంటూ రైతుల ఆవేదన

కామారెడ్డి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):
జిల్లాలో వేల ఎకరాల్లోనే రైతులు ఆరుతడి పంటలను సాగు చేస్తుంటారు. ఈ ఆరుతడి పంటలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రతీ సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. కామారెడ్డి జిల్లా రైతులకు మార్క్‌ఫెడ్ శాఖ నుంచి ఎన్నో పనులు ఉంటాయి. పంట ఉత్పత్తుల కొనుగోళ్ల నుంచి మొదలుకొని అకౌంట్‌లో డబ్బులు పడకపోవడం, పంట ఉత్పత్తుల వివరాలను నమోదు చేసుకోవడం వంటివి మార్క్‌ఫెడ్ శాఖ అధికారులను, సిబ్బందిని రైతులు సంప్రదిస్తుంటారు. ఇందుకోసం కామారెడ్డి కలెక్టరేట్‌లోని మార్క్‌ఫెడ్ శాఖ కార్యాలయానికి రైతులు వస్తే అక్కడ ఎవరూ కనిపించరు. శాఖకు కార్యాలయాన్ని కేటాయించినప్పటికీ పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో గత 8 ఏళ్లుగా నిజామాబాద్ జిల్లా నుంచే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. దీంతో రైతులు తమ గోడును విన్నవించుకునేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు, సిబ్బంది లేకపోవడంతో నిజామాబాద్‌కు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో కామారెడ్డి కలెక్టరేట్‌కు తరలించాలని ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు సైతం కలెక్టర్‌ను కోరారు. ఇప్పటికైనా మార్క్‌ఫెడ్ శాఖ కార్యాలయాన్ని కామారెడ్డికి పూర్తిస్థాయిలో తరలించాలని రైతులు కోరుతున్నారు.

నిజామాబాద్ నుంచే కార్యకలాపాలు

కామారెడ్డి కలెక్టరేట్‌లో మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినప్పటికీ గత 8 ఏళ్లుగా నిజామాబాద్ నుంచే పాలన కొనసాగుతోంది. రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నిజామాబాద్ జిల్లాకు చెందిన మారగంగారెడ్డి కొనసాగడంతో నిజామాబాద్, కామారెడ్డి మార్క్‌ఫెడ్ కార్యకలాపాలు నిజామాబాద్ జిల్లా నుంచే కొనసాగిస్తూ వచ్చారు. నిజామాబాద్ జిల్లాలో కలెక్టరేట్ సమీపంలో మార్క్‌ఫెడ్‌కు ప్రత్యేక భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఇక్కడి నుంచే కామారెడ్డి శాఖ కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నాయి. కామారెడ్డి కలెక్టరేట్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినప్పటికీ ఇక్కడ ఏ ఒక్క సిబ్బంది కూడా ఉండరు. మార్క్‌ఫెడ్ డీఎం ఉమ్మడి జిల్లా నుంచే కొనసాగుతున్నారు. మార్క్‌ఫెడ్ కార్యాలయానికి అవసరం నిమిత్తం వచ్చే రైతులు, సొసైటి సిబ్బంది, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌లు జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయానికి వచ్చి అక్కడ ఎవరూ లేకపోయే సరికి నిజామాబాద్‌కు వెళ్లే పరిస్థితి వస్తుందని బాధితులు వాపోతున్నారు.

ఖాళీ కుర్చీలే దర్శనం

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని కార్యాలయాలు ఒకే గొడుగు కిందకు ఉండాలని గత ప్రభుత్వం ఇంటిగ్రేట్ కలెక్టరేట్‌ను ఏర్పాటు చేసింది. కలెక్టరేట్‌లో దాదాపు 45 శాఖల కార్యాలయాలు కొనసాగుతున్నాయి. వీటితో పాటు మార్క్‌ఫెడ్ కార్యాలయం ఉంటుంది కానీ ఆ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎవరూ కూడా కనిపించరు. కార్యాలయానికి వెళితే ఖాళీ కుర్చీలే దర్శనం ఇస్తాయి. ఇంటిగ్రేట్ కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కార్యాలయం కార్యకలాపాలు ఎక్కడి నుంచి కొనసాగుతున్నాయో రైతులకు తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు జిల్లా మార్క్‌ఫెడ్‌కు పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో నిజామాబాద్ నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కామారెడ్డి మార్క్‌ఫెడ్ శాఖలో కనీసం 5గురు అధికారులు, సిబ్బంది ఉండాలి. కానీ ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఒక డీఎంతో పాటు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ ఉండాలి. కానీ ప్రస్తుతం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, అకౌంటెంట్‌లు మాత్రమే ఉన్నారు.

దూర ప్రాంత రైతులకు ఇబ్బందులు

రైతుల నుంచి కొనుగోలు చేసిన మక్కలు, జొన్నలు, శనగలు, కందులకు సంబంధించిన డబ్బులు సమయానికి రాకపోవడంతో రైతులు మార్క్‌ఫెడ్ శాఖ కార్యాలయానికే రావాల్సి ఉంటుంది. జిల్లాలో ఈ పంటలను ఎక్కువగా మద్నూర్, పిట్లం, బాన్సువాడ, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ లాంటి దూర ప్రాంతాలకు చెందిన రైతులే ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ రైతులకు మార్క్‌ఫెడ్ కార్యాలయం నుంచి పని నిమిత్తం నిజామాబాద్‌కు వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు ఎక్కువ కావడమే కాకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని మార్క్‌ఫెడ్ కార్యాలయానికి వస్తే అక్కడ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో నిజామాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పంట ఉత్పత్తులను సొసైటీలో విక్రయిస్తే అక్కడి సిబ్బంది అకౌంట్ నెంబర్‌లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ నమోదు చేయడంతో ఆ పని కావాలంటే నిజామాబాద్ మార్క్‌ఫెడ్‌కు పోవాల్సిందేనని సిబ్బంది సమాధానం ఇస్తున్నారని రైతులు చెబుతున్నారు.

పూర్తిస్థాయిలో మార్క్‌ఫెడ్‌ను తరలించాలంటూ ఎమ్మెల్యేల వినతి

నిజామాబాద్ నుంచి మార్క్‌ఫెడ్ కార్యకలాపాలు కొనసాగుతున్నందున అక్కడ ఉన్న సిబ్బందిని అధికారులను, కార్యకలాపాలను కామారెడ్డికి పూర్తిస్థాయిలో తరలించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావులు ఇది వరకే జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌కు లేఖలు రాశారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ కార్యాలయం లేకపోవడంతో ఏవైన సమస్యలు వస్తే నిజామాబాద్‌కు వెళ్లలేకపోతున్నారని రైతులు, సొసైటీల సీఈవోలు, పాలకవర్గాలు గతంలోనూ కలెక్టర్‌కు విన్నవించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ దృష్టి సారించి కామారెడ్డి కలెక్టరేట్‌కు మార్క్‌ఫెడ్ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ



ఎల్లారెడ్డిలో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : పలు పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. బస్సులను సరైన సమయంలో అందుబాటులో ఉంచాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన బస్సులు నడుపుతున్నారని వాపోతున్నారు. ఆదివారం వారాంతపు సంత ఉండడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో ఎల్లారెడ్డి పట్టణానికి వస్తుంటారు. బాన్సువాడ, మెదక్, కామారెడ్డి డిపోలకు చెందిన బస్సులు నిత్యం ఎల్లారెడ్డి మీదుగా ప్రయాణిస్తుంటాయి. ఈ బస్సులు సమయానికి రావడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బాన్సువాడ మార్గంలో వెళ్లే వారికి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు బస్సులు రావడంలేదని, కామారెడ్డి మార్గంలో వెళ్లే వారికి 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉండడం లేదని పేర్కొంటున్నారు. మండలంలోని అన్నాసాగర్, బొగ్గుగుడిసే, తిమ్మారెడ్డి, వెల్లుట్ల, హాజీపూర్, లక్ష్మాపూర్, రాంపూర్ తదితర గ్రామాల ప్రజలు బస్సుల కోసం వేచి చూసి ప్రైవేట్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. వారాంతపు సంత, వివాహాల సీజన్ కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తున్నారు. వస్తే ఒకేసారి 4 నుంచి 5 బస్సులు వస్తున్నాయని రాకపోతే మొత్తానికి రావడం లేదని ఆర్టీసీ అధికారులు బస్సులు సమయాలకు అనుగుణంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వసతి గృహ ఆవరణలో టేకు చెట్ల నరికివేత



వసతి గృహంలో టేకు దుంగలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం ఆవరణలో ఉన్న టేకు చెట్లను హాస్టల్ వార్డెన్ శారదా చెట్లను నరికి వేయించి కొన్ని దుంగలను హాస్టల్‌లోని ఓ గదిలో పెట్టించి, మరికొన్ని ఆవరణలో ఉన్నాయన్న సమాచారం మేరకు కామారెడ్డి స్పెషల్ డిప్యూటీ రేంజ్ అధికారిని అనురంజని రెడ్డి ఆదివారం వసతి గృహ ఆవరణలో ఉన్న టేకు దుంగలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. హాస్టల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఓ గదిలో టేకు దుంగలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారి అనురాంజనీరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ఇంటి, పొలాల వద్ద ఉన్న చెట్లను నరికితే ముందుస్తుగా అటవీ శాఖ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. హాస్టల్ ఆవరణలో నాలుగు టేకు చెట్లను నరికారన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నివేదికను పై అధికారులకు అందజేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంపై హాస్టల్ వార్డెన్ శారదా వివరణ కోరగా కోతుల బెడద ఎక్కువ ఉండటం వల్ల పిల్లలపై దాడి చేస్తున్నాయని అందువల్లే చెట్లను అనుమతి తీసుకుని తొలగించినట్లు తెలిపారు.



హాస్టల్‌లోని ఓ గదిలో టేకు దుంగలను ఉంచి సీజ్ చేస్తున్న అటవీ శాఖ అధికారులు

టీకాతోనే పశువులకు రక్ష



గేదెకు టీకా వేస్తున్న అధికారులు

- నెల రోజుల పాటు సాగనున్న గాలికుంటు నివారణకు టీకాల కార్యక్రమం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన
- జిల్లాలో 5.55 లక్షల పశువులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):
ప్రతీ ఏడాది వివిధ రకాల వ్యాధులతో పశువులు, జీవాలు వందల సంఖ్యలో మృత్యువాత పడుతుండడంతో పోషకులు, రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పశువుల మరణాలు అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఏడాది పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈనెల 15 నుంచి జిల్లాలో ప్రారంభమైన టీకాల కార్యక్రమం మే 15 వరకు కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5.55 లక్షల పశువులు ఉన్నాయి. ఇందులో తెల్ల పశువులు 48 వేల వరకు, గేదెలు 73,524, గొర్రెలు 3 లక్షల 30 వేలు, మేకలు 1లక్ష 3 వేల వరకు ఉన్నాయి. పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అవగాహన కలిగి ఉంటూ సకాలంలో నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధ శాఖాధికారులు సూచిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు ఇలా..

గాలికుంటు వ్యాధి సూక్ష్మక్రిములతో వ్యాప్తి చెందుతోంది. ఫుట్ అండ్ మౌత్ డీసీజ్‌గా ఈ వ్యాధిని పేర్కొంటారు. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. వ్యాధిసోకిన సమయంలో గేదెలు, ఆవులు 24 గంటలలోగా బక్కచిక్కి అల్సర్ భారిన పడడంతో పాటు ఆడ పశువుల్లో గర్భం విఫలమవుతోంది. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నోరు, మూతి, కాళ్లు, గిట్టలపై పుండ్లు, బొబ్బలు రావడం, నోటి నుంచి విపరీతంగా నురుగ రావడం లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి సోకిన పశువులు ముడుచుకుని పడుకుంటాయి. మేత, నీళ్లకు దూరంగా ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో పశువులు, దూడలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. పశువుల అంతస్రావాల వల్ల వ్యాధి మిగితా పశువులకు వ్యాపించే అవకాశం ఉంటుంది. వ్యాధికారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతోంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఒక చోటు నుంచి మరో చోటుకు త్వరగా వ్యాప్తి చెందుతోంది. ఈ వ్యాధి ఎక్కువగా ఆగష్టు, సెప్టెంబరు, మార్చి, ఏప్రిల్ నెలల్లో సోకుతోంది. ప్రతీ ఏటా ఈ నెలల్లో వ్యాధి నివారణకు పశు సంవర్ధకశాఖ పశువులకు టీకాలు వేస్తోంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో ఉత్పాదకశక్తి తగ్గిపోతోంది. జ్వర తీవ్రత పెరిగి పశువులు నీరసిస్తాయి. ఫలితంగా పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతారు.

రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలి

- సంజయ్ కుమార్, జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి

రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రతీ ఏటా రెండు సార్లు వేయించే గాలికుంటూ నివారణ టీకాలను పశువులకు తప్పనిసరిగా రైతులు వేయించాలి. గాలికుంటూ వ్యాధి సోకిన పశువులు మేత మేయక బక్కచిక్కి చివరకు ప్రాణాల వదులుతాయి. పశుపోషణపై ఆధారపడే రైతులకు పశువులు మృత్యువాత పడితే ఆర్థికంగా నష్టపోతారు. ప్రస్తుతం జిల్లాలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలి. మే 15 వరకు అన్ని గ్రామాల్లోని పశువులకు ఉచితంగా టీకాలు వేస్తాం. టీకాలు వేయించడం ద్వారా పశువులు ఆరోగ్యవంతంగా ఉంటాయి.

ప్రతీ ఏడాది రెండు సార్లు టీకాల కార్యక్రమం

వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమతో రైతులు ఆర్థికంగా బలపడుతున్న నేపథ్యంలో వారు నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతీ ఏటా రెండు సార్లు ఉచితంగా గాలికుంటూ వ్యాధి నివారణ కార్యక్రమం చేపడుతారు. జిల్లాలోని మొత్తం 52 పశు సంవర్ధకశాఖ ఆసుపత్రులలో, సబ్ సెంటర్‌లలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జిల్లాలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం విస్తృతంగా చేపట్టనున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు గ్రామాల్లోకి వెళ్లి టీకాలు వేస్తున్నారు. గాలికుంటు ప్రాణాంతకం కావడంతో చిన్నపాటి అలసత్వం వహించిన పశువులు మృత్యువాత చెందుతాయి. వ్యాధి భారిన పడిన పశువులను ఇతర వాటికి దూరంగా ఉంచాలి. ఎప్పటికప్పుడు పశువుల పాకలను శుభ్రం చేయడంతో పాటు సున్నం చల్లి, క్రిమి కీటకాల నివారణకు చర్యలు తీసుకోవాలి. వ్యాధి సోకిన గేదె, ఆవు నుంచి తీసిన పాలను 100 డిగ్రీల సెల్సియస్ వద్ద వేడి చేసిన తర్వాతే తాగాలి. పశువు చనిపోతే గోతిలో వేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి పాతి పెట్టాలి.



వ్యాధికి గురైన పశువులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వం నాకుటుంబంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది

● నాతో రాజకీయం చేయు.. కుటుంబ సభ్యులతో కాదు : బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆరోపణ

బోధన్‌రూరల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నా కుటుంబంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా బోధన్ బీఆర్ఎస్ కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించకుండా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. తనపై సైతం లేనిపోని కేసులు జోడించి వేధిస్తున్నారని తన కుమారుడిపై కావాలని కేసులు పెట్టించి అనవసరమైన రాద్ధతం చేస్తున్నారని, ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆరోపించారు. దుబాయ్‌కి ఆరోగ్య సమస్యల వల్ల బోధన్ కార్యకర్తలకు దూరమయ్యాయని పేర్కొన్నారు. తనకు ఆరోగ్యం బాగా లేకనే బోధన్‌కు రాలేకపోయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాని కాంగ్రెస్ నాయకులు అనవసరమైన పుకారలను తనపై సృష్టించారని ఆరోపించారు. తన కుటుంబాన్ని మానసికంగా వేధించేందుకు తప్పుడు కేసులు పెట్టి 200మంది పోలీసులను తన ఇంట్లోకి పంపించారని ఆరోపించారు. చిన్న పిల్లలను, మహిళలను చూడకుండా ఒక ఉగ్రవాది కంటే ఘోరంగా తన పట్ల ప్రవర్తించారని ఉద్వేగానికి గురయ్యారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నీకు దమ్ముంటే నాతో రాజకీయం చేయాలని, చిన్న పిల్లలతో, కుటుంబ సభ్యులతో నీచ రాజకీయం చేయడం సరికాదన్నారు. పీడీఎస్ బియ్యం ఎలాంటి అవకతవకలు జరగలేదని అనవసరంగా నన్ను బద్నామ్ చేస్తున్నారన్నారు. తన తల్లి ఇటీవల మరణించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కనీసం ఫోన్ చేసి పరామర్శించలేదని ఇదేనా మానవత్వపు రాజకీయం అని ఆయన ప్రశ్నించారు. రైస్‌మిల్లుల్లో రూ.7కోట్ల బకాయిలు చెల్లించాలని నోటీసులు వచ్చాయని, దీనిపై నేను న్యాయపరంగా పోరాడుతానని ప్రభుత్వానికి ఎంత సొమ్ము ఇచ్చేది ఉన్న కట్టేస్తానని పేర్కొన్నారు. ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తూ కేసులు పెడితే తాము భయపడామని తెలంగాణ ఉద్యమ సమయంలో తమపై వందల కేసులు అయ్యాయని గుర్తు చేశారు. 10సంవత్సరాల బీఆర్ఎస్ పాలనకు 18నెలల కాంగ్రెస్ పాలనను ప్రజలు చూస్తున్నారని, తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుని అవకాశం ఇస్తే అధ్వానంగా పరిపాలన కొనసాగిస్తున్నారని తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. సుదర్శన్ రెడ్డి వైఖరితో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైతం అయోమయంలో ఉన్నారని విమర్శించారు.


బోధన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షకీల్

● రజతోత్సవ మహా సభను విజయవంతం చేయాలి

ఈ నెల 27వ తేదిన వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ మహసభలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే షకీల్ బోధన్ నియోజకవర్గ కార్యకర్తలను కోరారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఏర్పడిన నాటి నుండి తెలంగాణలో అనేక ఉద్యమాలు చేపడుతూ దేశంలోనే అగ్రగామిగా బీఆర్ఎస్ పార్టీ నిలబడిందని ఆయన పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు సకాలంలో అధిక సంఖ్యలో మహసభకు తరలే విధంగా సన్నద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, గిర్దావర్ గంగారెడ్డి, నర్సింగ్ రావు, శ్రీనివాస్, శ్రీరామ్, రజాక్, సంజీవ్ కుమార్, గోగినేని నర్సయ్యలతో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బినోలలో బోనాల పండుగ


బోనమెత్తిన గ్రామస్థులు

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులు బోనాలను తలపై పెట్టుకుని ఆలయానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు కృష్ణప్రసాద్ జోషి, గ్రామస్థులు భక్తులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ టీమ్ దాడి

● 11మంది పేకాట రాయుళ్ల అరెస్టు ● రూ.31,460 స్వాధీనం

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ శివారులోని పంట పొలాల్లో పేకాట ఆడుతున్న వారిపై ఆదివారం రాత్రి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 11మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుండి ఆరు ద్విచక్ర వాహనాలు, 10సెల్‌ఫోన్‌లతో పాటు రూ.31,460లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి చర్య నిమిత్తం వారిని నవీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌స్పెక్టర్ అంజయ్య, ఎస్ఐ గోవింద్, సిబ్బంది ఉన్నారు.

కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాల రోడ్డు సేఫ్టీ ఛాంపియన్ అవార్డుకు ఎంపిక


హైదరాబాద్‌లో అవార్డు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

కోటగిరి,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాల రోడ్డు సేఫ్టీ ఛాంపియన్ అవార్డుకు ఎంపికైంది. గత రెండు నెలల క్రితం పాఠశాలలో సర్వేజన ఫౌండేషన్ నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాల రోడ్డు సెఫ్టీ చాంపియన్ అవార్డుకు ఎంపికైంది. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా పాఠశాల ఉపాధ్యాయులు బర్ల సాయిలు, ఎండీ అతిక్ అవార్డును అందుకున్నారు. పాఠశాల అవార్డుకు ఎంపిక కావడం పట్ల కోటగిరి ఎంఈవో శ్రీనివాస్ రావు హర్షం వ్యక్తం చేశారు.

గోదావరి నదిపై చురుకుగా కొనసాగుతున్న వంతెనల నిర్మాణం

● రోడ్డు బ్రిడ్జి పనులు దగ్గర పడగా.. కొనసాగుతున్నరైల్వే బ్రిడ్జి పిల్లర్ల పనులు


యంచ వద్ద కొనసాగుతున్న మరో రైల్వే బ్రిడ్జి పిల్లర్ల నిర్మాణ పనులు


చురుగ్గా సాగుతున్న పిల్లర్ నిర్మాణపు పనులు


యంచ గోదావరి నదిపై సాగుతున్న పనులు

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరి నదిపై రోడ్డు బ్రిడ్జి నిర్మాణ పనులు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. సంగారెడ్డి నుండి మహారాష్ట్రలోని అకోల వరకు చేపట్టిన 161జాతీయ రహదారి నిర్మాణ పనులలో భాగంగా కామారెడ్డి జిల్లా మద్నూర్ నుండి బోధన్ వరకు 161 బీబీ మొదటి ఫేస్, బోధన్ నుండి నిర్మల్ జిల్లా బైంసాకు రెండవ ఫేస్ నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం మంజూరు చేసింది. దీనిలో భాగంగా రోడ్డు విస్తరణల పనులు దాదాపుగా పూర్తి కాగా యంచ గోదావరి నదిపై రోడ్డు బ్రిడ్జి నిర్మాణ పనులు సైతం దగ్గర పడ్డాయి. అలాగే దక్షిణ మధ్య రైల్వే మేడ్చల్ నుండి మహారాష్ట్రలోని ముఖేడ్ వరకు రైల్వే డబ్లింగ్ పనులు మంజూరు కాగా మండలంలోని మహంతం నుండి బాసర వరకు రైల్వే డబ్లింగ్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న రైల్వే బ్రిడ్జి పక్కన మరో రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పిల్లర్ల పనులు కొనసాగుతున్నాయి. గోదావరి నదిపై నిర్మిస్తున్న రోడ్డు, రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనులు పూర్తయితే పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాతో పాటు మహారాష్ట్రలో ఉన్న పలు ప్రాంతాలకు రాకపోకలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

కెరీర్ గైడెన్స్ విద్యార్థుల భవిష్యతుకు ఉపయోగకరం


ఆర్మూర్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కెరీర్ గైడెన్స్ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు రిటైడ్ ఐజీపీ డాక్టర్ విశ్వనాథ రవీందర్ అన్నారు. ఆదివారం ఆర్మూర్‌లోని క్షత్రియ కళ్యాణమండపంలో పెర్కిట్, మామిడిపల్లి, ఆర్మూర్ క్షత్రియ సమాజ్ సభ్యుల సౌకర్యార్థం కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విశ్వనాథ్ నవీన్ మాట్లాడుతూ విద్యార్థులకు కోర్సుల గురించి వివరించారు. వివిద కోర్సుల ప్రాముఖ్యత, అవకాశాలపై విశ్లేషనాత్మకంగా వివరించారు. కోర్సుల వివరాలను ఎల్ఈడీ స్క్రీపై పదర్శిచి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు రెడ్డి ప్రకాష్, కార్యదర్శి పడాల గణేష్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, జీవి ప్రశాంత్, పండిత్ ప్రేమ్, పండిత్ పవన్, రాజ్‌కుమార్, కర్తన్ దినేష్, గంగామోహన్, అల్జపూర్ లక్ష్మీనారాయణ, సంతాని విజయ్, జెస్సు అనిల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

● ఒకరికి గాయాలు


మృతిచెందిన బాలుడిని మార్చ్యురీకి తరలిస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్ బాలురు ఓంకార్(14), భానుప్రసాద్ (11)లు మృతిచెందగా విశ్వనాథ్ అనే ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన బంజ విశ్వనాథ్ పెర్కిట్ లోని ఒక వివాహ కార్యక్రమానికి తన కుమారుడు ఓంకార్ అతడి స్నేహితుడు భానుప్రసాద్‌లను బైక్‌పై తీసుకొని బయల్దేరాడు. పెర్కిట్ 44వ జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా నిర్మల్ నుండి వస్తున్న లారీ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో భానుప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా గాయాలపాలైన తండ్రి కొడుకులైన విశ్వనాథ్, ఓంకార్‌లను పోలీస్‌లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓంకార్ మృతిచెందాడు. తీవ్రగాయాలపాలైన విశ్వనాథ్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశ్వనాథ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నవీపేటకు చెందిన సాయితేజ అనే యువకుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. తన మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ ఐపీఎల్‌కు సంబంధించిన బెట్టింగ్ ఆడడంతో పాటు నిజామాబాద్‌కు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తితో ముఠాగా ఏర్పడి అతనికి మధ్యవర్తిగా పని చేసేవాడని ఎస్ఐ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులకు బెట్టింగ్ పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి వారికి సంబంధించిన డబ్బులను సాయితేజ ఇమ్రాన్‌కు పంపించే వాడని అన్నారు. సాయితేజ బెట్టింగ్ ఆడే యువకులకు ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చే వాడని దీంతో చాలా మంది యువకులు బెట్టింగ్‌లో డబ్బులు కట్టి నష్టపోయ్యారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేయగా నిందితుడి సాయితేజను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని, మరో నిందితుడు ఇమ్రాన్ పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

మాదిగ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):మాదిగ ఉద్యోగుల సమైఖ్య నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నూత్‌పల్లి మారుతి, సంకెపల్లి గంగాధర్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధి కారిగా ఇందూరు శ్రీనివాస్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా బాబా శ్రీనివాస్, అడిషనల్ జనరల్ సెక్రెటరి గద్దల రమేష్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్, జాతీయ నాయకులు తెడ్డు గంగారాం, రేణికుంట నాం పల్లిలు వ్యవహరించారు. వీరితో పాటు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నూత్‌పల్లి మారుతి మాట్లాడుతూ మాది గల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాననిఅన్నారు.నూతన కార్యవర్గం ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర కమిటీ నాయకులు దేవేంద్రప్రసాద్, యాదగిరి, సురేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాంపల్లి, తెడ్డుగంగారాం, ప్రమోద్, భూషణ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


ముప్కాల్‌లో రజతోత్సవ బహిరంగా సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముప్కల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):ఈనెల 27వ తేదీన తలపెట్టిన చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముప్కాల్ మడల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావించి 25ఏళ్ల పూర్తయిన సందర్భంగా వరంగల్‌లో నిర్వహించనున్న 25వ రజతోత్సవ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా రజతోత్సవ బహిరంగ సభ వాలపోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బర్దిపూర్ చర్చిలో ఈస్టర్ వేడుకలు

.డిచ్‌పల్లి,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్దిపూర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. చర్చి ఫాదర్ దినాకర్ ఆధ్వర్యంలో ఉదయం 4గంటల నుంచి స్త్రీల మైత్రి కార్యక్రమంలో భాగంగా సూర్యోదన ఆదరనలో సంఘ కాపారి క్రీస్తు మరణం గురించి దినాకరణ్ వివరించారు. ఈ సందర్భంగా స్త్రీలు ప్రత్యేకమైన గీతనాలు, ఆలంపించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కులపెద్దలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మాక్లూర్,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో భిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తున్న గుర్తు తెలియని వ్యక్తి గత మూడు రోజు లుగా గుడిలో అనారోగ్యంతో ఉండడం గమనించిన గ్రామ స్థులు చికిత్స నిమి త్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికి త్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మర ణించిన వ్యక్తిని ఎవరైన గుర్తు పట్టినచో మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదిం చాలని ఆయన కోరారు.


మృతుడి ఫొటో

కిసాన్‌నగర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక


కిసాన్‌నగర్‌లో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

బాల్కొండ ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకు న్నారు. గ్రామ అధ్యక్షుడిగా కొండ అశోక్, ఉపాధ్యక్షులుగా ఐలా పూర్ శ్రీని వాస్, కోశాధికారిగా ఆడెపు రవీందర్, ప్రధాన కార్యదర్శిగా శివ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు హనుమంతు, నాగభూషణం, అమర్నాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాణంపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం



రాణంపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని రాణంపల్లి గ్రామంలో కావేరి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో భవన నిర్మాణ కార్మికులతో పాటు స్థానికులకు బీపీ, షుగర్‌తో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావేరి ఆసుపత్రి వైద్యులు రోహిత్, మేనేజ్‌మెంట్ కరుణాకర్, శ్రీధర్, వినోద్, కార్మిక సంఘం నాయకులు మల్లేష్, బుజ్జి స్వామి, నాగేష్, అశోక్, ప్రవీణ్, మీరా, రాజు, లాలయ్య, కాశీం తదితరులు పాల్గొన్నారు.

రేపు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

బాల్కొండ,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన భూభారతి ఆర్ఓఆర్ చట్టం 2025పై అవగాహన కార్యక్రమం ఈ నెల 22న బాల్కొండ మండల కేంద్రంలోని ఎంకె గార్డెన్‌లో సాయంత్రం 4గంటలకు జిల్లాకలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ అడ్ప శ్రీధర్ తెలిపారు. ఈకార్యక్రమానికి మండల పరిధిలోని రైతులు, ప్రజలు హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

ధర్పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భూభారతిపై అవగాహన కల్పించడానికి నేడు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ధర్పల్లి తహసీల్దార్ మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. ధర్పల్లి గ్రామంలోని రైతు వేదికలో మధ్యాహ్నం 2.30 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు హాజరుకా నున్నారని తెలిపారు. ఈ సభకు పెద్దసంఖ్యలో రైతులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

పగలే వెన్నెలాయే..

● డిచ్‌పల్లి-నిజామాబాద్ ప్రధాన రోడ్డుపై విద్యుత్ లైట్ల పరిస్థితి ● పట్టించుకోని నుడా అధికారులు



నడిపల్లి శివారులో పట్టపగలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు

డిచ్‌పల్లి,ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ ప్రధాన రోడ్డుపై ఉన్న సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగడం లేదు. గత నెల రోజులుగా ఈ లైట్లు రాత్రి సమయంలో పూర్తి స్థాయిలో వెలగకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విచిత్రమేమం టే అక్కడక్కడ కొన్ని లైట్లు పగటి సమయంలో మాత్రము వెలుగుతు రాత్రి సమయంలో వెల గడం లేదు. విద్యుత్ లైట్ల మెంటెన్స్ సరిగా లేక ఈలైట్లు వెలగటం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. లైట్లు వెలగకపోవడంతో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలు భారిన పడుతు న్నారు. నుడా (నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెం ట్ అథారిటీ) అధికారులు, ప్రజాప్రతినిదులు పట్టించుకోకో పోవడంతోనే ఈ సమస్య ఎదురవు తుందని వెంటనే విద్యుత్ లైట్లు వెలిగేల చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. పన్నులు వసూళ్ల తీసుకునే నుడా గ్రామాల లో ఉన్న సౌకర్యాలను నిర్లక్ష్యం చేయడం సరికాదని వాహనచోదకులు పేర్కొంటున్నారు.

● నుడా పనితీరుపై విమర్శలు

నుడా ఆధ్వర్యంలో కొనసాగుతున్న డిచ్‌పల్లి-నిజామాబాద్ రోడ్డు మధ్యలో పెంచిన మొక్కలకు కనీసం నీరు అందించక పోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ఎండలు మండిపోతుండటంతో మొక్కలు ఎంపిపోతున్నాయి, మొక్కలకు నీటిని అందించి పచ్చదనాన్ని కాపాడాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

శివనామ స్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): శివనామ స్మరణతో ముక్తి, సకల శుభాలు కలుగుతాయని సద్గురు 108షడ్‌బ్రాహ్మ శ్రీశ్రీ దీన్‌దయాల్ శివాచార్య మహరాజ్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాయ ఆలయ ప్రాంగణంలో అఖండ 20వ శివనామ సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని ఆయన సూచించారు. భక్తులు సన్మార్గంలో నడవాలని సూచించారు. భక్తిమార్గంలో నడిస్తే ముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుంకిని మహరాజ్ సిద్ద లింగాప్ప, బాబయప్ప, వెంకటేశ్వర్ రావు దేశాయ్, నర్సింగ్ అప్పా, శ్యామ్‌రావు, శివకుమార్ అప్పా, కైలాస్ అప్పా, పురాణే అజయ్‌కుమార్, లక్ష్మణ్ రావు పటేల్, మాధవరావు తదితరులున్నారు.


భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


మాక్లూర్‌లో చెక్కుల అందజేస్తున్న దృశ్యం

మాక్లూర్,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాక్లూర్ గ్రామానికి చెందిన బొబ్బిలి సత్తెమ్మ అనే మహిళకు రూ. 12వేలు, కృష్ణానగర్ గ్రామానికి చెందిన నాగేశ్వర్‌కు రూ. 60వేలు సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వరావు అందజేశారు. ఇటీవల వారు అనారోగ్యానికి గురికావడంతో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి చొరవతో ఇట్టి చెక్కులను అందజేనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాబర్, అలీం, స్వామి, జైల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీనగర్ కాలనీలో చోరీకి విఫలయత్నం

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాజీ నగర్ కాలనీలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశాడు. అర్ధరాత్రి సమయంలో కాలనీలో ఉండే ఓ మహిళ తన ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూమ్ వైపు వెళ్తుండగా ముఖానికి టవాల్ చుట్టుకున్న గుర్తు తెలియని దుండగుడు మహిళ మెడ, నోటిని గట్టిగా పట్టుకున్నాడు. దీంతో ఆమె భయంతో కేకలు వేయడంతో దుండగుడు పారిపోయాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె 100కాల్ చేయడంతో పోలీసులు బాధితురాలి ఇంటికి చేరుకుని విచారణ జరిపారు. ఈ విషయంపై ఎస్ఐ వినయ్‌ని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.


ఎల్లమ్మతండా వద్ద బృహత్ ప్రకృతి వనంలో కాలిపోయిన మొక్కలు


బృహత్ ప్రకృతి వనంలో చెడిపోయిన బోరుమోటారు


బృహత్ ప్రకృతివనంలో నాడు ఏపుగా పెరిగిన మొక్కలు (ఫైల్)

జీవం కోల్పోతున్న పల్లెప్రకృతి వనాలు!

● బృహత్ ప్రకృతి వనానికి నిప్పు ● కాలిపోయిన మొక్కలు ● పట్టించుకోని అధికారులు

లింగంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతి వనాలు జీవం కోల్పోతున్నాయి. ప్రజలు సేద తీరేందుకు.. వృద్ధులు, ప్రకృతి ప్రేమికులు వాకింగ్ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చుచేసి ప్రతీ పల్లెలోనూ ప్రకృతివనాలను ఏర్పాటుచేసింది. ఒక్కో ప్రకృతివనంలో వేలల్లో మొక్కలు నాటారు. వాటిని కాపాడేందుకు ఉపాధిహామీ పథకంలో ఒక కూలీని నియమించారు. అందమైన మొక్కలతోపాటు పూల మొక్కలను, వృక్షాలను అందులో నాటారు. కొంతకాలం క్రితం కొంతవరకు బాగానే ఉన్నాయి. కొన్నిగ్రామాల్లో సాయంకాలం వేల వృద్ధులు, ఇతరులు ప్రకృ తివనాలలోకి వచ్చి సేదతీరే వారు పండుగలు, ఇతర ఉత్సవాల సందర్భం గా గ్రామస్థులు ప్రకృతి వనంలోకి వచ్చి భోజనాలు చేసి ఆడుకునేవారు. కానీ నేడు అవి కొన్ని గ్రామాల్లో పూర్తిగా పాడయ్యాయి. కొన్ని గ్రామా ల్లో కొంతవరకు చెట్లు ఉన్నాయి. పూలచెట్లు, అందమైన చెట్లు ఎండి పోయాయి. రూ.లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు ఇలా ఆదరణ లేక ఎండిపోయి పాడవుతున్నాయని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని ఎల్లమ్మ తండా వద్ద ఎల్లారెడ్డి - కామారెడ్డి రహదారి పక్కన వాహనదారులకు సేద తీరేందుకు, 10 ఎకరాలలో బృహత్ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. అందులో 30వేల మొక్కలను నాటారు. మొక్కలను కాపాడేందుకు బోరువేసి ప్రకృతివనం చుట్టూ పైప్‌లైన్ వేశారు. వీటన్నింటికీ రూ.10 లక్షల వరకు ఖర్చుచేశారు. అంతలోనే సర్పంచ్‌ల కాలపరిమితి పూర్తికావడంతో ప్రకృతి వనాలను పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారుల పర్యవేక్షణ లేక బోరుమోటరు చెడి పోవడంతో మొక్కలకు నీటిని పట్టే నాథుడు కరువయ్యాడు. మొక్కలు వాడిపోయి ఎండిపోయాయి. ప్రజలకు పచ్చదనాన్ని ఇవ్వాల్సిన బృహత్ ప్రకృతివనాన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు స్థలా న్ని కబ్జా చేసేందుకు నిప్పంటించారు. అగ్నికి అహుతి అయ్యింది. పచ్చని మొక్కలతోపాటు, ఏపుగా అందంగా పెరిగి నీడను ఇచ్చే చెట్లు సైతం అగ్గిలో కాలిబూడిదయ్యాయి. బోరు మోటరుచెడిపోయి నెలలు గడుస్తున్నా దాన్ని పట్టించుకున్నవారు లేరు. దీంతో బోరు మోటారు బోరులోనే ఇరుక్కు పోయింది. మొక్కలు కాలిపోయాయి. ప్రభుత్వ లక్ష్యం, ప్రజల ఆశలు నెరవేరకుండానే ప్రజా ధనం వృధా అయ్యిందని మండల ప్రజలు అంటున్నారు. మండలంలోని అనేకగ్రామాల్లో పల్లెప్రకృతి వనాల పరిస్థితి ఇలాగే ఉందని గ్రామాలలో పంచాయితీ కార్యదర్శులు పట్టిం చుకోవడం లేదని ఏమిటని ఎవరైనా అడిగితే పంచాయతీలో డబ్బులు లేవని చెబుతున్నారని అంటున్నారు. ప్రకృతివనాలను కాపాడేందుకు, హరితహారంలో నాటిన మొక్కలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి వాటర్ ట్యాంకర్ కొనుగోలు చేసింది. కానీ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీలలో డబ్బులు లేవనే సాకుతో ఇవేవి పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి గ్రామీణ ప్రజలకు పచ్చదనాన్ని అందించే ప్రకృతి వనాలను, ఎల్లమ్మ తండాలో ఏర్పాటు చేసిన బృహత్ ప్రకృతి వనాన్ని కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.


మొక్కలకు నీటిని పట్టేందుకు నాడు ఏర్పాటు చేసిన బోరుమోటరు (ఫైల్)

కొత్త మొక్కలు నాటిస్తాం



● నరేష్ ఎంపీడీవో

బృహత్ ప్రకృతి వనంలో కాలిపోయిన మొక్కల స్థానంలో వర్షాకాలంలో కొత్త మొక్కలు నాటిస్తాం. చెడిపోయిన బోరు మోటారును తిరిగి రిపేరు చేయిస్తాం. పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రకృతి వనాన్ని కాపాడుతాం.

ఫటా..ఫట్...

వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు పాటించి ఎండల నుంచి ఉపశమనం పొందాలి

● కమ్మర్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హసీనా



కమ్మర్‌పల్లి, ఏప్రిల్20. (ఆంధ్రజ్యోతి): వేసవిలో గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకుంటు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందాలని కమ్మర్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ అఫీసర్ డాక్టర్ డాక్టర్ హసీనా అన్నారు

ఆంధ్రజ్యోతి: ఎండల నుంచి రక్షణకు గర్భిణులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్: గర్భిణులు ఎండలో తిరగొద్దు. తప్పనిసరి అనుకుంటే తలపై తెల్లగుడ్డ కప్పుకోవాలి. శరీరానికి తెల్లదుస్తులు మాత్రమే ధరించాలి.

ఆంధ్రజ్యోతి: ఎండలో తిరిగితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి?

డాక్టర్: ఎండలో తిరిగితే శరీంలోని లవణాలు చెమటరూపంలో బపటకు వచ్చి నీరసంతో పాటు జ్వరం వస్తుంది.

ఆంధ్రజ్యోతి: ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

డాక్టర్: చెమట రూపంలో బైటకు వచ్చిన లవణాలు తిరిగి మన శరీరంలో నిలువ ఉండడానికి ద్రవ పదార్థాలను ఎక్కువగా సేవించాలి.

ఆంధ్రజ్యోతి: ఎలాంటి ద్రవపధార్థాలు తీసుకోవాలి?

డాక్టర్: కొబ్బరినీళ్ల, గంజి, నిమ్మరసం, అంబలి, మజ్జిగలాంటి ద్రవపదార్థాలు సూవిస్తూ అధిక మోతాదులో నీళ్ల తాగాలి.

ఆంధ్రజ్యోతి: గర్భిణులు ఓఆర్ఎస్ సేవించవచ్చా?

డాక్టర్: గర్భిణులు ఓఆర్ఎస్ సేవించవచ్చు. ఆసుపత్రి పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలలో ఉందుబాటులో ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: గర్భిణులు ఏలాంటి పండ్లు తీసుకోవాలి?

డాక్టర్: దానిమ్మ, ఖర్బూజ, కిరదోస, బీట్‌రూట్, క్యారెట్ లాంటి పండ్లు, వాటి జూస్ తీసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: వేసవిలో గర్భిణులు రోజువారి ఎన్ని లీటర్ల నీళ్ల తాగాలి?

డాక్టర్: గర్భిణులు ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు ప్రతీ రోజు 6 నుంచి 8 లీటర్ల నీరు తాగాలి. మధ్యాహ్నం బపటకు రాకుండ విశ్రాంతి తీసుకోవాలి. బయటకు వెళ్లాల్సి వస్తే ఉదయం, సాయంత్ర వేళల్లో మాత్రమే వెళ్లాలి.

ఆంధ్రజ్యోతి: ఇంకా తీసుకోవాలసిన జాగ్రత్తలు ఏమిటి?

డాక్టర్: గర్భిణులు అధిక బరువు ఎత్తరాదు. రక్తహీనత ఉన్న గర్భిణులు తప్పకుండా ఆకుకూరలు, పండ్ల పాలు కోడిగుడ్లు ఎక్కువగా తీసుకోవాలి. మసాల ఆహారాలకు దూరంగా ఉండాలి. ఉప్పు తగినంత వాడాలి. పడుకునే సమయాల్లో కాళ్లకింద దిండు పెట్టుకోవాలి దీంతో కాళ్లకు వాపులు రావు. ప్రతీ నెలవారిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలి.



శిథిలావస్థకు చేరిన పడిగెల ప్రభుత్వ బీసీ హాస్టల్ భవనం ఇదే..

శిథిలావస్థలో పడిగెల బీసీ హాస్టల్ భవనం

● మినరల్ వాటర్ ప్లాంట్ వినియోగం లేక ఇబ్బందులు
● పెచ్చులూడుతున్న భవనం స్లాబ్ పైకప్పు
● నూతన హాస్టల్ భవనం నిర్మించాలని పడిగెల విద్యార్థుల వేడుకోలు


వేల్పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని పడిగెల గ్రామంలో ప్రభుత్వ బీసీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. సుమారు 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ హాస్టల్ భవనం గోడలు అక్కడక్కడ బీటలు వారాయి. భవనం స్లాబ్‌పై పెచ్చులు ఊడిపడుతున్నాయి. కొన్నిగదుల తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో వర్షం కురిసిందంటే చాలు గోడల నుంచి స్లాబ్ పైకప్పు నుంచి నీరు వస్తోంది. నిర్మాణ సమయంలో స్లాబ్‌పైన ఫ్లోరింగ్ నాణ్యతగా చేయకపోవడం వల్ల వర్షం నీరు నిలిచిపోయి స్లాబ్ గోడల ద్వారా నీరు గదుల్లోకి వస్తోంది. గదులలో ఫ్యాన్‌లకు, లైట్‌లకు బిగించిన వైరింగ్ చాలా చోట్ల దెబ్బతినడం వల్ల గోడలు వర్షం నీటితో తడిసిన సమయంలో తేమ వచ్చి కరెంటు షాక్ వచ్చిందని గోడలను ముట్టుకోవాలంటేనే భయపడుతుంటామని విద్యార్థులు తెలిపారు. ఇన్ని సమస్యల మధ్య విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది క్రితం ఇక్కడ మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోయినప్పటికీ నేటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో హాస్టల్ వార్డెన్ బయట నుంచి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తూ విద్యార్థులకు తాగునీరు అందిస్తున్నారు. వంద మంది విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్‌లో కొన్ని బాత్‌రూంలు ఉన్నప్పటికీ వాటిలో కొన్నింటికి తలుపులు వంగిపోవడం, గొళ్లాలు ఊడిపోవడం, తలుపులకు రంధ్రాలు ఉండడం వంటివి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నూతనంగా హాస్టల్ భవనాన్ని నిర్మించాలని, లేదా నాణ్యతతో కూడిన మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.


పెచ్చులూడిన బీసీ హాస్టల్ భవనంలోని ఓ తరగతి గది పైకప్పు

హాస్టల్ భవన మరమ్మతుల కోసం అధికారులకు విన్నవించాం

● భోజేంధర్, హాస్టల్ ఇన్‌చార్జీ వార్డెన్, పడిగెల

పడిగెల ప్రభుత్వ హాస్టల్ భవన దుస్థితిని పైస్థాయి అధికారులకు విన్నవించాం. భవనం గదుల్లో అక్కడక్కడ పెచ్చులుడింది. దెబ్బతిన్న కిటికిలు, తలుపులు, బాత్‌రూంల పరిస్థితులు పాడైపోయిన మినరల్ వాటర్ ప్లాంట్‌ల విషయాలను బీసీ వేల్పేర్ డెవలప్మెంట్ అధికారికి వివరించాం. ఈ రాబోయే వేసవికాలం సెలవుల్లో హాస్టల్ భవనంలోని అన్నిరకాల మైనర్ మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.


మరమ్మతులకు నోచుకోని మినరల్ వాటర్ ప్లాంట్

అభివృద్ధి ముసుగులో
మొరం దందా!

● ఇందిమ్మ ఇళ్ల పేరిట పక్కదారి పడుతున్న మొరం
● పట్టించుకోని అధికార యంత్రాంగం


అక్రమంగా టిప్పర్‌లో ఎడపల్లికి తరలిస్తున్న మొరం

ఎడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామాన్ని ప్రజాపాలన పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 128 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. మంజూరు చేసిన ఇందిమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మందకొడిగా జరగడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మండల అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మొరం, ఇసుక లేక ఇబ్బంది అవుతుందని తెలుపగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా మొరం, ఇసుక తరలింపుకు అనుమతి ఇవ్వాలని ఎడపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇదే అదునుగా భావించిన మొరం మాఫియా రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా ప్రతీ రోజు అక్రమ మొరం తవ్వకాలు చేపడుతున్నారు.

● పక్కదారి పడుతున్న మొరం తవ్వకాలు

వాస్తవానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తరలించాల్సిన మొరం పక్కదారి పడుతోంది. కాసుల కక్కుర్తితో కొందరు మొరం వ్యాపారులు రెవెన్యూ అధికారులకు మామూళ్ల ఇస్తూ మొరాన్ని ఇతరులకు అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తాము చేపట్టిన గృహ నిర్మాణాల వద్దకు టిప్పర్‌లు వెళ్లవని ట్రాక్టర్‌లకు అనుమతి ఇవ్వాలని సమీక్షా సమావేశంలో అధికారులను కోరారు. ఇంత వరకు అంతా బాగానే ఉంది కానీ ఇక్కడే అసలు కథ మొదలైంది. ట్రాక్టర్‌లలో ఇందిరమ్మ ఇళ్లకు తరలించాల్సిన మొరం టిప్పర్‌లలో ఇతర గ్రామాలకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటూ విలువైన వన సంపదను కొల్లగొడుతున్నారు. వీరికి రెవెన్యూ అధికారులు సహాయ సహకారాలు అందించడంతో వీరి అక్రమ వ్యాపారం మూడు పూవ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. జైతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకని చెప్పి రెవెన్యూ అధికారులే మొరం మాఫియాకు తవ్వినంత తవ్వు కోండి ఎవరైనా అడిగితే ఇందిరమ్మ ఇళ్లకని చెప్పండి అని చెప్పడం కొసమెరుపు.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

● ధన్వాల్, తహసీల్దార్

ఎడపల్లిలో మొరం తవ్వకాలకు ఎలాం టి అనుమతులు ఇవ్వలేదు. గ్రావెల్ రోడ్డు కు మొరం అవసరం ఉంటే అనుమతి తీసుకుని ప్రభుత్వానికి డీడీ చెల్లించి అనుమతి తీసుకోవాలి. ఎలాంటి డీడీలూ చెల్లించకుండా మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

● ఎడపల్లిలో అధిక ధరలకు మొరం అమ్మకం

జైతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు, ఏఆర్పీ గ్రామంలో గ్రావెల్ రోడ్డుకు అని చెప్పి మొరం మాఫియా ప్రభుత్వానికి ఒక్క రూపాయి కట్టకుండా వడ్డాపల్లి గ్రామంలో ఇష్టారీతిన మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఈ మొరాన్ని ఇఎడపల్లి మండల కేంద్రంలో అధిక ధరలకు అమ్ముతున్నారు.


సుద్దులం, కోరట్‌పల్లి శివారులో ఆలయ భూముల్లో వరి సాగు చేస్తున్న దృశ్యం (ఫైల్)


మరమ్మతులు లేక దెబ్బతిన్న ఆలయం పైకప్పు

రామా.. నీ భూములకు రక్షణేది?

● సుద్దులం, కోరట్ పల్లి గ్రామాల శివారులో ఇందల్వాయి రామాలయ భూములు
● 45 ఎకరాలను అక్రమంగా సాగు చేసుకుంటున్న వైనం ● పట్టించుకోని దేవాదాయ శాఖ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అది 187 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాచీన ఆలయం. ఎంతో ప్రచుర్యం కలిగిన ఆలయం నేడు నిర్లక్ష్యానికి గురవుతోంది. ఆ గుడి ఇందల్వాయి రామాలయం. ఎంతో ప్రాముక్యత కలిగిన ఈ రామాలయం భూములు డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి, గ్రామాల శివారులో సుమారు 45 ఎకరాలకు పైగా ఉన్నాయి. కానీ దేవాలయ శాఖ ఈ భూములపై శ్రద్ధ చూపని కారణంగా దేవుని మాన్యం కబ్జా కోరల్లో చిక్కుకుంది. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో ఆలయం కూలిపోయే దశకు చేరుకుంది ఇప్పటికే కల్యాణ వేదిక, సత్రాలు, యజ్ఞశాల, మండపాలు, కూలిపోయే దశకు చేరుకున్నాయి. గత మూడేళ్ల క్రితం నాటి రాష్ట్ర దేవాలయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు గ్రామస్థుల కోరిక మేరకు ఆలయం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన అది కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం సైతం మారిపోవడం ఆ విషయం కాస్తా మూలన పడింది. ఎండోమెంట్ అధికారులు నిర్లక్ష్య ధోరణితో గ్రామస్థులు, భక్తులు, అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామాలయానికి చెందిన కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను తమ పేర పట్టాలు చేసుకునేందుకు కబ్జా రాయుళ్ల విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం ప్రజాప్రతినిధుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రామాలయ భూములపై కోర్టులో న్యాయ పరిష్కారం కోసం దేవాదాయ శాఖ అధికారులు కేసులు వేశారు. అవి ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం

● ప్రభాకర్, తహసీల్దార్

రామాలయానికి చెందిన భూముల్లో కొందరు రైతులు అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి చెందిన భూముల్లో రైతుల కబ్జాలో ఉన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోనుంది. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ట్రాక్టర్ కింద పడి బాలుడిమృతి

రాజంపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుడితండా గ్రామానికి చెందిన మాలవత్ గణేష్(3) ట్రాక్టర్ టైర్ కింద పడి శని వారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. గణేష్ శని వారం రాత్రి పార్క్‌చేసిన ట్రాక్టర్‌పైన కూర్చుని ఆడుకుంటుండగా ఒక్క సారిగా ట్రాక్టర్ ట్రాలీతో పాటు వెనక్కి రావడంతో ట్రాక్టర్‌పై నున్న గణేష్ కిందపడ్డాడు. ట్రాక్టర్ టైర్ బాలుడిపైకి ఎక్కడంతో తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. బాలుడి కుటుంబసభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బస్వాపూర్‌లో ఘనంగా ఈస్టర్



బస్వాపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మం డలంలోని బస్వాపూర్ చర్చిలో ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో పాస్టర్ విల్సన్ ఆధ్వర్యంలో ఉదయం శిలువ వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం చర్చి ప్రాంగణంలో పెద్దఎత్తున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనం తరం పాస్టర్ మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే రోజున శిలువపై అర్పించిన త్యా గం అనంతరం మూడవరోజు ఆదివారం మరణాన్ని జయించి తిరిగి లేచిన మహోత్తర ఘట్టమని, ఈ పునరుజ్జీవనం క్రైస్తవ విశ్వాసానికి పునాదిరాయి అని వివరించారు.

దోమకొండ :మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో ఘనంగా యేసుక్రీస్తు పునరుద్ధణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ శ్రీనివాస్ సాప మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధలు మానవళికి అనుసరనీయం అని అన్నారు. ఆదివారం గుడ్ ఫ్రూట్ మినీస్ట్రీస్ ఆధ్వర్యంలో జీఎఫ్ఎం ప్రేర్ హల్‌లో ఏసుక్రీస్తు పునరుద్ధనపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాప పవిత్ర, జ్ఞాన్‌కుమార్, రాజ్‌కుమార్, మోహన్‌రెడ్డి, కమల, మరియమ్మ, రాజు, రిబీక, రాజయ్య ,పున్నమ్మ బాగ్యమ్మ, భక్తులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు కరువుభత్యం అమలు చేయాలి

దోమకొండ,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది బీడీ కార్మికులు వివిధ కంపనీలలో పని చేస్తున్నారని వారికి కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శివంది సత్యం అన్నారు. ఆదివారం దోమకొండలో ఆయన బీడీ కార్మికుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.నిత్యవసర సరుకులు పెరగడం వలన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.01,04,2005 నుండి పెంచిన వీడీఏను అమలు చేసి బీడీ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు దోమకొండలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

దోమకొండ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని పైడిమర్రి ఫంక్షన్ హాల్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ఎస్ కార్య కర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావు, బుర్రి రవి కుమార్ ఆదివారం తెలిపారు. చలో వ రంగల్ సమావేశపు సన్నాహా కార్యక్రమంపై మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హజరై కార్యకర్తలకు వివరిస్తారని తెలిపారు.

27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తోట గాంధీ ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు 21 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

బైరాపూర్ చెరువులో శవం లభ్యం

బీర్కూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామ శివారులోని ఊర చెరువులో ఆదివారం గుర్తు తెలియని మగ మనిషి మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడికి సుమారు ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ కలర్ షర్టు, కాఫీ కలర్ ప్యాంటు ఉంది. మృతుడి గురించి ఎవరికైనా తెలిస్తే తమకు ఫోన్ చేయాల్సిందిగా ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బీర్కూర్ ఎస్సై సెల్ నెంబర్ 8712686173, బాన్సువాడ రూరల్ సీఐ 8712686170లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పట్టు చీరలు అందజేత



పట్టు చీరలు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామారెడ్డి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పిప్పిరి చిన్న లక్ష్మి లింబాద్రి ఇటీవల మరణించాడు. మృతుడి కుమార్తె వివాహం సందర్భంగా అమ్మాయి భార్గవి మేనమామ లక్ష్మీనారాయణ అభ్యర్థన మేరకు బాధితులకు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్ గుప్తాను సంప్రదించగా సాయినేని ట్రస్ట్ ద్వారా గాంధారి మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సత్యం రావు ద్వారా పుస్తెమట్టలను, పట్టుచీరను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సదాశివనగర్ మాజీ జడ్పిటిసి పడిగేలా రాజేశ్వర్ రావు, గాంధారి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సత్యం రావు, నాగిరెడ్డిపేట్ మాజీ జడ్పీటీసీ పాల్గొన్నారు..

వైభవంగా

శ్రీ రుకిణ్మిపాండురంగ విగ్రహప్రతిష్ఠాపన

పిట్లం ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):మండలంలో తిమ్మనగర్ గ్రామంలో ఆదివారం అంరంగ వైభవంగా శ్రీరుక్మిణిపాండురంగ విగ్రహప్రతిష్టాపన కార్యక్రమం శ్రీహంపీ పీఠాదిపతి శ్రీవిద్యారణ్యాభారతీ స్వామీ చేతుల మీదుగా జరిగింది.గ్రామాస్తులు స్వామీ వారికి ఘనంగా స్వాగతం పలికినారు.విగ్రహప్రతిష్ట కార్యక్రనికి విచ్చేసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్ ఆలయ కమిటి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.ఎమ్మెల్యే పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావ్

విద్యతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

● రిటైర్డ్ గురుకుల ఆర్‌సీవో తులసీదాస్ ● భిక్కనూరు గురుకుల పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



భిక్కనూరులో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

భిక్కనూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి విద్యతో పాటుగా క్రమశిక్షణను అలవర్చుకోవాలని, తద్వారా జీవితంలో విజయం సాధించవచ్చునని గురుకుల పాఠశాల రిటైర్డ్ ఆర్‌సీవో తులసీదాస్ అన్నారు. ఆదివారం భిక్కనూరు గురుకుల పాఠశాలలో 2007-08 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారి గురు వులను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది ఎంతో ఉత్తమమైనదని, జీవితంలో ఒకేసారి విద్యార్థి దశ వస్తుందని అన్నారు. ఈ సమయంలో నేర్చుకున్న విద్య, క్రమశిక్షణ మిమిల్ని మంచిస్థాయిలో నిలబెడతాయన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు ఒకరినొకరు అప్యాయంగా పలుకరించుకుని క్షేమసమాచారాలను అడిగి తెలుసుకుని పాత జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ఉపాధ్యాయులను విద్యార్థు లు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీడీ నర్సింగ్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ రఘునా యక్, మాజీ ప్రిన్సిపాల్ గులాం యాజదని, జనార్ధన్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పిట్లం బ్లూకోర్ట్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ

కామారెడ్డిటౌన్/పిట్లం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పిట్లం గ్రామానికి చెందిన గుణిజి సునిత ఆదివారం మధ్యా హ్నం గ్రామశివాలయం సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య ప్రయత్నం చేసింది. ఆమె ఆత్మహత్య ప్రయత్నాన్ని గమనించిన స్థానికులు 100 నంబర్‌కు డయల్ చేయడంతో బ్లూకోర్ట్ కానిస్టేబుల్ రవిచంద్ర, హోంగార్డు మారుతి తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బాధితురాలిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.సిబ్బంది చేసిన సాహసోపేతమైన చర్యలను అభినందిస్తు ఎస్పీ రాజేష్‌చంద్ర వారిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల రక్షణ కోసం ఎల్లప్పుడు పోలీసులు సిద్ధంగా ఉంటారని బ్లూకోర్ట్ సిబ్బంది మరోసారి నిరూపించారని తెలిపారు.



మహిళను కాపాడి బయటకు తీసుకువస్తున్న పోలీసులు

బాన్సువాడలో చోరీ

● 12 తులాల బంగారం, 20 తులాల వెండి, 21 వేల నగదు అపహరణ



చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అశోక్

బాన్సువాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో భారీ చోరీ జరిగిన ఘటన చోటు చేసుకుంది. సంగమేశ్వర కాలనీకి చెందిన చనంగారి అంజయ్య, సోదరి, తల్లి సాయమ్మ ఇతర కుటుంబ సభ్యులు రాత్రిపూట ఉడకపోత ఉండడంతో కింద ఇంటికి తాళం వేసి పైన దాబాపై పడుకున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో తాళాలు పగల కొట్టి దొంగలు ఇంట్లో చొరబడి సుమారు 12 తులాల బంగారం, 20 తులాల వెండి, 21 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కుటుంబసభ్యులతో మాట్లాడి చోరీ జరిగిన స్థలాల్లో క్లూస్‌టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరు కూడా ఇంటికి తాళాలు వేసి అజా గ్రత్తగా ఉండ కూడదని డాబా పైన పడుకున్న ఆరు బయట పడుకున్న ఇతర గ్రామాలకు వెళ్లిన తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. చోరికి పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తం



ఆయా లేకపోవడంతో వంట చేస్తున్న టీచర్

మద్నూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తంగా నడుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఇబ్బందులకు గురవుతున్నారు. డోంగ్లి మండలంలో 30 అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు 3 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. అంగన్ వాడీ కేంద్రాలను పరిశీలించాల్సిన సూపర్ వైజర్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీలకు అందాల్సిన పౌష్టిక ఆహారం అందటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8 గంటలకే తెరుచుకోవాల్సి ఉన్నప్పటికీ పదిగంటల వరకు తెరచుకోవటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చిన్నారులు హాజరు కాకపోయినప్పటికీ హాజరు అవుతున్నట్లు పట్టికలో నమోదు చేస్తున్నారని ప్రజలు ఆరోపించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆయాలు లేనప్పటికీ అంగనవాడీ వర్కర్లే రెండు బాధ్యతలను నిర్వహిస్తున్నారని, దీంతో విద్యార్థులకు చదువు చెప్పాల్సిన టీచర్లే ఆయాలుగా విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' లింబూర్, టాక్లీ పెద్ద, సిర్పూర్, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిం చగా పలు సమస్యలు వెలుగు చూశాయి. డోంగ్లి మండలానికి సంబంధించిన సూపర్ వైజర్ జుక్కల్ మండలంలో సైతం అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండడంతో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేయలేక ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ స్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల అధ్యక్షుడు

మాచారెడ్డి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ నాయక్,డైరెక్టర్ బుచ్చిరెడ్డి ప్రారంభిం చారు. ప్రతిరైతు కొనుగోలు సెంటర్‌లకు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ ధరలకు అమ్మకాలు జరపాలని తెలిపారు. దళారులను నమ్మిమోసపోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమం లో సీఈవో చంద్రారెడ్డి,మార్కెట్ కమిటి డైరెక్ట ర్ రాజలింగం,ఏఈవో శ్రీలత, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి,నర్సింలు, యుగేందర్, బాలయ్య, దేవరాజు, శ్రీను,ఎల్లయ్య,ఐలయ్య, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్ : మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో గున్కుల్ సొసైటీ పరిధిలోని తుంకిపల్లి క్లస్టర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలుచేస్తుందని రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగిం చుకోవాలని సూచించారు.

శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) జన జీహెచ్‌ఎంసీ చీఫ్ హార్టికల్చర్ అధికారి నారెడ్డి సునంద రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన నారెడ్డి సునంద రెడ్డి పదోతరగతి వరకు పక్కనే ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో చదువుకున్నారు. పదోతరగతి 1993 - 94 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన చిన్ననాటి మిత్రులందరు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కాలభైరవ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేసానని జీహెచ్‌ఎంసీ కల్చర్ అధికారి నారెడ్డి సునంద రెడ్డి పేర్కొన్నారు. అనంతరం మిత్రులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో మిత్రులు, అధికారులు అడ్డగుల్ల శ్రీనివాస్ గుప్తా, అబ్బ లింగం, దొంతుల రవి, తోకల రమేష్, సాయిబాబా, హరికిషన్, కుమారస్వామి, ప్రభాకర్, రేగుల నరేందర్, మమత, పుష్పలత, మెడికల్ భాగ్య, కవిత, శారద, సుందరి దేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్నఅధికారి

అగ్నిప్రమాదాల నివారణకు సత్వర చర్యలు

● ఇన్‌చార్జి ఫైర్ అధికారి మదన్



విశ్రాంత ఫైర్ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ అగ్నిమాపక శాఖ పరిధిలో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే, నివారణకు సత్వర చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఫైర్‌అధికారి మదన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఫోన్‌లో సమాచారం అందించాలని సూచించారు. వారోత్సవాలను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విశ్రాంత ఫైర్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది, ప్రజలు తదితరులున్నారు.

ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

● భిక్కనూరు భజన మండళ్ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున భజన



సిద్దరామేశ్వరనగర్ గ్రామంలో భజన చేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని భిక్కనూరు మండల భజనమండలి సభ్యులు అన్నారు. భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని సిద్దరామేశ్వరనగర్, రామేశ్వర్‌పల్లి గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు ఆయాభజన మండళ్ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల భజన మండలి సభ్యులు మాట్లాడుతూ ప్రతి శనివారం స్థానిక హనుమాన ఆలయంలో పెద్దఎత్తున భజన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల భజన మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీచైర్మన్ కూతురు వివాహానికి హాజరైన ఎమ్మెల్యేలు



వివాహానికి హజరై వధువరులను ఆశీర్వదిస్తున్న ప్రజాప్రతినిధులు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల మాజీ జడ్పీ చైర్మన్‌లు దఫేదర్‌రాజుశోభల కూతురు వివాహనికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు హజరయ్యారు. ఆదివారం సత్యకన్వెక్షన్‌లో వివాహం జరగగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంపగోవర్ధన్, హనుమంత్‌షిండే, జాజాలసురేందర్,మాజీ ఎంపీ బీబీపాటిల్‌లు హజరై వధూవరులను ఆశీర్వదించారు.

హరినామ సప్తాహ ముగింపు



నీళ్ళు తీసుకెళుతున్న గ్రామస్తులు

మద్నూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న తడ్గూర్ గ్రామంలో అఖండ హరినామ సప్తాహ ముగింపు ఉత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కళశాలలతో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ మందిరం వద్ద అఖండ హరినామ సప్తహ కీర్తన, హరతీ మహోత్సవం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో యువకులు దీక్షలు తీసుకోవడంతో గ్రామాలు భక్తిమయంగా మారుతున్నాయి. అదేవిధంగా గ్రామంలో పెద్దలు హరినామ సప్తః శివనామ సప్తః పేరుతో వారం రోజులపాటు భజన కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామాల్లో భక్తి పారవశ్యం పొంగిపొర్లుతుంది. ఆదివారం ముగిసిన హరినమ సప్తాహ కార్యక్రమంలో తెలంగాణ భక్తులతో పాటు మహారాష్ట్ర భక్తులు సైతం పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు

బీర్కూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ధాన్యం లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న రాజు, బాన్సువాడ సాయిలుకు గాయాలయ్యాయి. కారు కూడా డ్యామేజ్ అయింది. కోటగిరి మండల కేంద్రానికి చెందిన రాజు, సాయిలు ఒక పని నిమిత్తం కార్‌లో బిచ్కుందకు వెళ్లారు. పనిపూర్తి చేసుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. ఇదిలా ఉండగా బీర్‌కూర్ గ్రామ పరిధిలోని సిద్ధి వినాయక రైస్‌మిల్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న ధాన్యం లోడ్‌తో ఉన్న లారీని ఢీ కొట్టారు. ఈ ఘటనలో రాజు, సాయిలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యపరిస్థితి బాగుందని పోలీసులు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- గుడ్ బ్యాడ్ ఆగ్లి
ప్రియా 70	- జాక్
ప్రియా 35	- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి

బాన్సువాడ

మహేశ్వరి	- ఓదెల 2
వెంకటేశ్వర	- ఒక్కడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

